# దేశమంటే మనుషులోయ్

చంద్రం నిరాహారదీక్ష పూనాడని సుబ్బారావు చెప్పగానే తారెత్తి పోయాం. అంతవరకూ చంద్రం ఇంకా ఎందుకురాలేదా? అని అను అనుకుంటున్న మేము, అందులోనూ సుబ్బారావ్ చెప్పాడంటే ఇంక నమ్మకుండా వుండడం ఎట్లా?

ఇప్పుడేమంత అవసరం వచ్చిందబ్బా!...నిరాహారదీక్షకి!" అని మూర్తి మొదలెట్టేడు.

ఏదో ఒక అవసరం అంటూ రావాలా ఏమిటి?—అది గాంధీగారి టైములో...ఈ రోజుల్లో అయితే కారణం అక్కర్లేదు– ఎప్పుతూ ఏవో గొడవలే కాబట్టి వెతుక్కో అక్కరలేదు" అని గోపాలం అన్నాడు.

"అయితే మనవాడు దేనికోసం చేస్తున్నాడంటావ్?"

"ఏముందిలే? ఇప్పుడు చేస్తున్న వాళ్ళందరికీ, ఎంత కారణం ఉందో వీడికి అంతే...తెలంగాణా అల్లర్లు, ఆంధ్రలో ఉక్కు ఫాక్టరీ, మతకలహాలు...! ఏదో ఒకటి!" అన్నాడు నిర్లిప్తంగా ఏ.వి. రావు.

"అన్నంతపనీ చేశాడు ఆఖరుకి" అన్నాడు సుబ్బారావ్.

చంద్రం ఇంతవరకూ అంటూ వస్తున్న దేమిటంటే...ప్రతీదానికీ సత్యాగ్రహం చేస్తానని, బాస్ సెలవు ఇవ్వక పోవడం దగ్గర నుండి, శంకర్‌గాడు కాఫీ ఇవ్వకపోవడం వరకూ అన్నీ వాడి సత్యాగ్రహానికి గురి అయేవి. అట్లా అంటూ జడిపించడమేగాని యిప్పటివరకూ ఆ

సత్యాగ్రహం ఏదో చేసిన పుణ్యాన్ని పోలేదు. అదీవాడు నిజమయిందంటే మాకందరికీ చెప్పలేని హడావుడి అయింది.

పదంతంటే పదండంటూ బయలుదేరాం సత్యాగ్రహం చేస్తున్న చోటికి—తోటి స్నేహితులం, ఆ మాత్రం, ఎంకరేజ్‌మెంట్ అయినా చేయొద్దా అని!

మేం వెళ్ళేసరికి చంద్రం మంచంమీద పడుక్కొని ఇంటివాసాలు లెక్కెడుతూ, ఏదో పరధ్యానంగా ఆలోచిస్తూ వున్నాడు. మమ్మల్ని చూసి ఒక్కనవ్వు నీరసంగా నవ్వి వూరుకున్నాడు. దేశ సేవ వాడి మొహంలో అప్పటికప్పుడే కొట్టవచ్చినట్టు కనబడుతూ వుంది.

"ఎప్పటినుండిరా?" అని అడిగాడు వేణు.

దానికి జవాబుగా మరో ముసి ముసి నవ్వు నవ్వేడు చంద్రం.

"అప్పుడే నీరసంగా వుందా...?" అని జాలిగా అడిగాడు గోపాలం.

అది విని ఏడుపు మొహం పెట్టాడు "సత్యాగ్రహం."

"ఆకలి వెయ్యటం లేదురా?" అని ఎ.వి. రావు అడిగేసరికి...

చంద్రం ఏడ్చేసి... పెదిమలు తడుపుకున్నాడు.

"ఫరవాలేదురా అది మూడు రోజులుంటుందిట... అంతవరకూ ఓర్చుకున్నావంటే, మరి ఎన్నాళ్ళయినా ఆకలేయదట! కాస్త ఓర్చుకో" అని సానుభూతి చూపేడు మూర్తి.

"ఒక డాక్టర్నయినా పిలవాలిరా! ఎప్పటికపుడు పల్సూ, రీడింగూ చూడ్డానికి.

"ఒక బోర్డు రాసి అవతల కట్టాలి! అన్నట్టు ఏమని వ్రాస్తాం? ఒరే చంద్రం అసలింతకీ ఏ మహోన్నత కార్యసిద్ధికోసం ఈ నిరాహార దీక్ష ఆరంభించావు?" అని అనేసరికి చంద్రం ఒక్కసారి లేచి—

"ఏండిరా... ఏండి ఎవడ్రా చెప్పేడు నేను నిరాహారదీక్ష పూనేనని" అని గట్టిగా అరిచాడు.

"అదేమిట్రోయ్! కడుపులో కామయ్యా కదులుతున్నాడేమిటి? ప్లేటు మార్చేస్తున్నావు!"

"మేం అప్పుడే అందరికీ గొప్పగా మా వాడు చంద్ర అనే, నూరు నయాపైసల దేశభక్తుడు నిరాహారదీక్ష చేస్తున్నాడు అని టాంటాం కొట్టేశామే గర్వంగా!"

"నీకు ఆకలివేసినా సరే, ఏమయినాసరే...ఇప్పుడు మాత్రం మానడానికి వీలులేదు. మా పరువేంగాను! ఫలానావాడి స్నేహితుడిలా చేశాడంటే నలుగురిలోనూ మొహం ఎత్తకు తిరగగలమా?"

"అవునవును అది నిజమే!" అని అన్నారందరూ. మనవాడు వికృ మొహం వేశాడు.

"లేకపోతే నీకిదేం బుద్ధిరా మమ్మల్ని వదిలేసి ఏ మినిష్టరో అయి పోదామనా? ఏం నీ ఎత్తు!"

"ఇన్నాళ్ళూ ఏదో మాట వరసకు అంటున్నావనుకుంటే ఇంత పని చేస్తావనుకో లేదురోయ్!" అని మంచం మీద కూర్చుని బుడి, బుడి రాగాలు మొదలెట్టేడు శంకరం.

"పోనీ ఉపవాసం చేస్తే చేశావుగాని ఎవరు లేకుండా చూసి కాస్త ముక్కుకింద గోతిలో వేసుకుంటూ వుండు" అని ఒకడనగా చంద్రానికి ఒళ్ళు మండి కోపంతో...

"సత్యాగ్రహం...నిరాహారదీక్ష అంటే భేదంతెలియని మీరట్రా అనేది దానికీ దీనికీ ముడిపెడతారేంటి? ఏం నేనేమంత తీసిపోయానను కున్నారా అలాంటి వెధవపని చేయడానికి...చేస్తే అక్షరాలా చేస్తాను... చేసి చూపిస్తాను తెలుసా?"

"ఇంచుమించు రెండూ ఒక దగ్గరే వుంటాయి అందుకే కలిపి అనేస్తారోయ్! వాటికి రాజకీయార్థాలు మాకెందుగ్గాని...తప్పేం లేదు... ఏమయినా తీసుకుంటే—కొన్నాళ్ళ పాటు, కొనసాగించడానికయినా బ్రతికుండొద్దూ!"

"అదేం ఖర్మరా?"

"మరి లేకపోతే నెలల తరబడి ఎలా వుంటున్నార్రా! మనకొక పూట భోజనం ఆలస్యమయితే కరకరలాడి ఛస్తామే!...పది పదిహేను రోజుల పాటయితే ఎవరికి తెలియకపోవచ్చు. నలుగురికి తెలిసేవరకయినా వుండాలి ఏమంటావు?"

"మరి డాక్టర్లు పరీక్ష చేయర్రా!" అని ఒకడు సందేహం వెలిబుచ్చాడు

"ఫరవాలేదు. నిరాహారదీక్షలో ఉన్నాడని తెలియగానే-యీలాటి వేవీ చూడరు. నాడి, రక్తపోటు ఇలాటివి చూసి వాళ్ళ రిపోర్టులు వాళ్ళిస్తూ ఉంటారు. అయినా అందరూ అలాటివారని కాదు...ఏదో ఒక మిషమీద ప్రజలలో అలజడి తీసుకువచ్చి-సత్యాగ్రహం, అహింస అనే పేరున విద్వేషాలు రేపి, హింసను ప్రోత్సహించే వాళ్ళు కొందరుంటారు. వాళ్ళు అవకాశ వాదులు. ఆ నాలుగు రోజులూ ప్రభుత్వాన్ని, ప్రజల నిత్య జీవితాన్ని స్తంభింపజేసి, దేశంలో దౌర్జన్యాన్ని, కలహాలనీ రెచ్చగొట్టి వదిలేస్తారు. తమకూ పేరు వస్తుందని తమ ఆశయమూ నెరవేరుతుందని ఇలాటి వారే నిజంగా దేశద్రోహులు."

"అవును. కొందరికి ఇదో వృత్తిగా కూడా మారిపోయిందట. ఎంతోకొంత ముట్టజెప్పి చేయిస్తూ ఉంటారట. అంతేకాదు– ఆ దీక్షలో ఉన్నంతసేపూ చందాలు వసూలుచేసి అదికూడా కాజేస్తారు ఉభయత్రా లాభం."

"బావుంది ! బావుంది. అయితే మన చంద్రం ఏ ఉద్దేశ్యంతో చేస్తున్నాడంటావు ఇంతకీ !"

"ఏమిరా! తెలంగాణా సమస్యా? మతకలహాలా! కాశ్మీరుసమస్యా? గాంధీ శతజయంతికి జ్ఞాపకార్థమా ? బ్యాంకుల జాతీయకరణమా ? ఏది కారణం?"

"అవేవీకావు. నేను చెయ్యాలనే చేస్తున్నాను!"

"అయితే ఆత్మప్రక్షాళన క్రిందికి వస్తుంది. ఇహనేం !"

"ఫర్వాలేదులేరా? యీ రోజుల్లో కారణమంటూ వెతుక్కోనక్కర లేదు, ఎప్పుడూ ఏదో ఒక నమస్య మన దేశాన్ని పీడిస్తూనే వుంటుంది!"

"పోనీకాని నాకు తెలియక అడుగుతాను. నువ్వు చెయ్యవలసిన ఉద్యోగం మాని, పనిమాని, ఇప్పుడు దేనికోసమో సత్యాగ్రహం అని కూర్చుంటే అది దేశసేవా ?"

"ఎంచేతకాదేం ? మరి పేరుపడిన యీ నాయకులంతా దేనికి చేస్తున్నారేం?"

"అందరూ కాదు. కొందరు మాత్రం "దేశసేవకూ" యీ సత్యాగ్రహాలకూ అర్థం తెలియక యిలా చేస్తున్నారంటాను ! రాజకీయంతో వారి వారి స్వప్రయోజనాలకూ, పార్టీ భేదాలకూ. కక్ష కసి పీటికి లొంగిపోయి పవిత్రమయిన "నిరాహారదీక్ష" "సత్యాగ్రహం" యీ రెంటినీ ప్రయోగిస్తున్నారు. స్వార్థంకోసం వాటి లక్ష్యాన్నే పాడు చేస్తున్నారు !"

"ఎవరో అలా చేస్తున్నారని నన్నూ కలపకు !"

"లేకపోతే మనలాటి వాళ్ళెందుకురా. మనం ఉద్యోగం చేస్తూ మన విధి మనం సరిగా నిర్వహిస్తే అంతకు మించిన దేశసేవ ఏముంది? ఇవి మాని చీటికీ, మాటికీ సత్యాగ్రహం అంటూ నిరాహారదీక్ష అంటూ డొక్క మొహం వేసుగొని, నీ ఒక్కడి గురించి అందరినీ ఆతృతపెట్టి దేశంలో అనవసర సంక్షోభం లేపి, మరింత అశాంతిని రేపడం తప్పితే ఏముంది! నీలాటివారి మూలాన్న ఈ రెండూ అపవిత్రమై పోయినాయి."

"అవునవును. నీలాగ అన్నిటికీ నీరసపడిపోయి, పౌరుషం లేకుండా వుంటే మన కోర్కెలు ఎన్నటికి తీరుతాయి ? మాటాడకుండా పడివుంటే ఆవు రోజూ పాలిస్తున్నట్టే అవుతుంది. ఒక్క తాపుతంతే దాని పేరు చెప్పుకుంటారు ! అవునా ?"

"అవును. కాళ్ళు అవి కట్టిపడేసి, నాలుగుతన్ని మరీ బలవంతాన దాని పొగరు కూడా అణుస్తారు."

"పోనీగాని, బాబ్జి తెలిసో, తెలియకో మొదలెట్టావు-ఏదోవంక పెట్టి విరమించుకో. సంప్రదింపులు జరుగుతున్నాయనీ, ఫలానా హామీ ఇచ్చారనో ఇంకేదో చెప్పవచ్చు."

"మనవాడికది నువ్వు చెప్పాలట్రా! వాడి జాగ్రత్తలో వాడుంటాడు!"

"ఇప్పటి కెంతసేపయింది?"

"ఇరవై రెండుగంటలు! కాని ఇరవై రెండురోజు లయినట్టుందిరా!" అన్నాడు జాలిగా చంద్రం.

"పోనీ, ప్రారంభించేముందు రెండ్రోజులకు సరిపడేగా— పట్టుపట్టేయాలి! ఒంటె ఎడారిలో నీళ్ళు స్టాకు చేసుకునేటట్టు అలాగేనా కనీసం చేశావా?"

"ఛస్తూవుంటే మీకు హాస్యం వేళాకోళంగా ఉన్నది. వెధవలు ఎవరూ సమర్థించక పోయినా, కనీసం సానుభూతి అయినా లేదు" అని వాపోయాడు ఆఖరికి.

"అంత ఇదయిపోకు. నిమ్మకాయరసమో, పళ్ళరసమో తీసుకో వచ్చునురా. అది తీసుకున్నా నీ దీక్షకేం లోపంరాదు! ఇహ పోతే కాఫీ, టీ, యివి ఎన్నిసార్లు పుచ్చుకున్నా అక్షేపణలేదు."

"బాగానేవుంది మీ సలహా! నే ఛస్తే ఛస్తానుగాని ముందు మీరందరూ దయచెయ్యండి. మీతో వాగలేక ప్రాణాలు పోతున్నాయి!" అన్నాడు చంద్రం.

చెపితే వినిపించుకునేట్టు లేడు. "అయితే నీ ఖర్మ" అనేసి అందరం వెళ్ళిపోయాం. వాడి నిరాహార దీక్షకి కారణం మాత్రం లాగ లేక పోయాం.

ఆ తర్వాత మా వాడికి ఎక్కడలేని ప్రచారం చేసారు మా బృందం అంతా! వాడి ఇల్లొక తీర్థయాత్రలా గయింది!

ఇదంతా చూసేసరికి వాడికి ఉత్సాహానికి బదులు భయం, బెంగ కలిగి కృంగిపోజొచ్చాడు. అదెందుకో మా కెవరికీ అర్థం కాలేదు.

వీడి సత్యాగ్రహానికి వెనుక ఎవరి ప్రోత్సాహమో వుండివుంటుంది. అని అనుకున్నాం. లేకపోతే ఇంత అకస్మాత్తుగా ఏపనీ జరుగదు.

* * * *

ఆ మర్నాడయ్యే సరికి కోతిపుండు బ్రహ్మరాక్షసి అయింది. ఏదో హాస్యాని కనుకున్నదల్లా ఆ వూరూ, వాడా పాకిపోయింది. ఆ అవ కాశం చూసుగొని వాడిచుట్టూ ఎంతమంది చేరారో లెక్కలేదు. అందరూ దేశభక్తులే! పెద్ద పెద్ద వాళ్ళుకూడా వచ్చి పోతున్నారు. ప్రతి నిముష నిముషానికీ అదో పెద్ద వార్తలా వ్యాపించేపోతూంది. ఉదయపు వార్తల్లో హెడ్ న్యూస్ అదే.

వూరులో దుకాణాలన్నీ మూసేరు, ఆఫీసులన్ని నామమాత్రంగా పనిచేస్తున్నాయి. బస్సులుగాని, రైళ్ళుగాని నడవడంలేదు. ఒకటి రెండు చోట్ల, బస్సులు తగలబెట్టేసేరు. రైల్వే సిగ్నల్సు, తీగలూ ధ్వంసం చేసారు. మెయిళ్ళు, ఎక్స్‌ప్రెస్‌లూ కదలకుండా ఆపేసేరు. స్కూళ్ళకు పిల్లలు వెళ్ళలేదు. ఎవరి మొహంలో చూసినా ఏదో ఆవేశం, ఉద్రేకం !

"ఎందుకయ్యా ఇదంతా అంటే...ఫలానా అని ఖచ్చితంగా ఒక్క కారణం ఎవరూ చెప్పలేదు! తలొకడూ తలొక కారణం, తలొక దారి స్వల్పకాలంలో ఆ వూరు వూరంతా దయ్యాలకొంపలాగా తయా రయింది. అట్టుడికినట్టు ఉడికిపోయింది. ఎవరికి తోచినట్టు వాళ్ళు విలయ తాండవం చేసారు.

ఏ పేపరులో చూసినా ఇదే వార్త, మా వాడిపేరు పెద్ద పెద్ద అక్షరాలతో, ఎవరికి తోచిన కారణం వారు వ్రాసేరు! రాజధానినుండి రాయబారాలకు పెద్దపెద్ద మంత్రులే రాసాగేరు

ఇంటిదగ్గరయితే లాభంలేదని–చంద్రాన్ని మోసుగుని కలెక్టరా ఫీసు గేటుముందు తీసుకువెళ్ళి బలవంతాన్ని పడేసారు. ఒక చిన్న

టెంటువేసి, టెంటుచుట్టూ పోస్టర్లు, వాలంటీర్లు, పోలీసులు, ప్రజలు, దొమ్మి, తీర్థప్రజ...

మళ్ళీ వెళ్ళి మా వాడిమొహం చూద్దామంటే, మా తరం కాలేదు. మమ్మల్ని వాడి చుట్టుపక్కలకు చేరనివ్వలేదు.

వాడి పేరుపెట్టి "చంద్రంగారికి జేయ్" "సత్యాగ్రహం సాగాలి" అనే నినాదాలు చెవులు గింగుర్లెత్తి పోతున్నాయి.

ఎట్లాగో జొరబడి, మాలో ఒకడు చూసిందేమిటంటే చంద్రం మొహంలో భయం, అయిష్టత, ఉన్నాయిగాని ధైర్యం, ఉత్సాహం కనబడలేదని తీరా వెళ్లేడుకదా అని మావాడు మాటాడబోయేసరికి అక్కడ ఎవరో తెలియని అంగరక్షకులు దగ్గరకు చేరనివ్వలేదట !

"చంద్రం చూసి ఆతృతతో ఏదో చెప్పబోయినా వీలుపడలేదట. మావాడ్ని చూసి కంటనీరు పెట్టుకున్నాడట!

అక్కడ చూసిన యింకో విశేషం ఏమిటంటే సీలువేసిన ఒక పెద్ద డబ్బా! దానిమీద–

"ఉద్యమం కొనసాగడానికి సాయం చేయండి!"

"ఇది మనకోసం! మన హక్కులకోసం!!"

అని వ్రాసివున్నదట చూడ్డానికి వెళ్ళిన వారందరి వద్దా–తృణమో పణమో వసూలుచేసి అందులో వేయిస్తున్నారట!

మా వాడూ విధిలేక ఓ రెండు రూపాయలు డబ్బాలోవేసి దండం పెట్టి బయటపడ్డాడు.

చుట్టుప్రక్కల చేరిన వాళ్ళందరూ చంద్రం ఎదురుగుండానే టీతో షోడాతో సేవిస్తూ, టిఫిన్లు చేస్తూ వున్నారు. చంద్రం కడుపుతో మాత్ర కరకర. అది చూడలేక మొహం అటు త్రిప్పేసుకుంటున్నాడు.

ఆ రోజూ మర్నాడూ ఎలా వుండాలో అలావున్నది. పట్టణం అంతా 106 డిగ్రీల జ్వరంతో వున్నట్టు.

మూడో నాటికల్లా ఎంత వేగిరం ప్రజ్వరిల్లిందో, అంత వేగిరం, చల్లబడిపోయింది ఆ రాత్రికి ఎవరో మంత్రిగారువచ్చి, ఏదోచెప్పి పండ్ల రసం త్రాగించారు చంద్రంచేత.

ఆఖరికి ఎందుకు నిరాహార దీక్ష బూనారో ఖచ్చితంగా ఇతమిద్ధమని, ఎవరికీ తెలియదు! పోనీ విరమించాక ఎందుకు విరమించాడో మంత్రిగారు ఏం హామీలు యిచ్చారో అంతకన్నా ఎవరికీ తెలీదు.

ఎవరికి తోచిన కారణాలూ, జవాబులూ వారే చెప్పుగున్నారు.

అసలు కారణంగాని, ఫలితంగాని, ఎవరికీఅక్కరలేదు!- ఎందరో సత్యాగ్రహంచేస్తున్నారు పదండి! మనమూ ప్రక్కనుందాం! అందరూ ఎదురుతిరిగి అన్ని పాడుచేస్తున్నారు పదండి! మనమూ చేద్దాం! అదుగో అక్కడ వాళ్ళని పట్టుగు కొడుతున్నారు! పదండి మనమూ కొడదాం! అదుగో అక్కడ మీటింగు పదండి మనమూ నిలబడదాం... అయిపోయింది! అతను నిరాహారదీక్ష విరమించుకున్నాడు ఇంత మనమూ నోరు మూసుకుందాం!" ఇలాటివాళ్ళు ప్రజలు!

అఖరుకు ఫలితం- బీభత్సం, సర్వనాశనం, నష్టపోయింది ప్రజలు! దేశం!!

గొర్రెల మందలాటిది జనం, ఒకడు కర్ర పట్టుగు పచ్చికమీదకు నడిపినా వెళతాయి! రైలు కట్టమీదకు తోలినా వెళతాయి! ఎందుకు ఏమిటి? అక్కడ ఏముంది? అనే సత్యం అక్కరలేదు!

తెల్లారేటప్పటికల్లా ఊరంతా గుప్పుమంది!

చంద్రం లేడు! చందా డబ్బాలేదు! చుట్టూచేరిన మనుషులూ లేరు.

"డబ్బా"మీద నిఘా వున్నవాళ్ళు ప్రయత్నించి చూశారు. లాభం లేకపోయింది! డబ్బాలో కూడిన డబ్బు! కనీసం పాతికవేలయినా వుంటుం

దన్నారు! మంచిమాటలాడిన మంత్రిగారు ముట్టచెప్పింది పాతిక వేలకు తక్కువ వుంటదని అన్నారు!

డబ్బుకోసం గడ్డితిన్న చంద్రం జాడ ఇప్పటికీ తెలియదు!

దేశానికి కలిగిన నష్టం ఎప్పటికీ తీరదు!

గ్రుడ్డిగా నమ్మే ప్రజల మనస్తత్వం ఎన్నటికీ మారదు?

సత్యం, ప్రేమ, వీటియొక్క శక్తిస్వరూపమ్ సత్యాగ్రహం దానిని అహింసా మార్గంలో, ఆత్మప్రక్షాళన చేసుగుంటూ, సాధించడానికి ఒక మార్గమ్ నిరాహార దీక్ష" అని గాంధీజీ చెప్పిన నిర్వచనానికి అవకాశవాదులూ. స్వలాభపరులూ, అవలంభిస్తున్న యీ పద్ధతుల వలన వచ్చిన యీ చెరగని మచ్చ ఏ నాటికీ చెరిగిపోదు!

"దేశమంటే మట్టికాదోయ్ మనుషులోయ్" అన్న గురజాడవారి గేయంలో మనుషులు... ఈ మనుషులు మాత్రం కాదు!

పొలికేక 28-8-70.